

# శుభాంతం

శ్రీరాధానాథ కొండపి

ఒక బండిలో కొంతమంది ప్రయాణీకులు ఒక నగరానికి ప్రయాణం చేస్తున్నారు. వారు కాలక్షేపం కొరకు ఆ రోడ్డుమీద దారి కొట్టే దొంగల వన్నాగములు, వారినుండి తప్పించుకున్న కొందరు ధీరుల చరిత్రలను చెప్పుకొంటున్నారు. వారంతా "డబ్బుగల వారు ముందే జాగ్రత్తగా దాచుకోవా" లని హెచ్చరించు కొంటున్నారు. ఒక యువతి పకపక నవ్వుతూ, నావద్ద మూడువందల రూపాయల నోట్లు వున్నయ్. ఆ నోట్లు నా కాలి మేజోళ్లలో వున్నయ్. వాటిపైన చెప్పులు తొడుక్కున్నాను. దొంగలు నా డబ్బు యెక్కడున్నదీ గుర్తించలేరని తన తెలివి తేటలు ప్రదర్శించింది. వారిలో మూలగా కూర్చున్న వృద్ధుడు ఆమె చెప్పినదంతా శ్రద్ధగా విని తల పంకించాడు. కొంతదూరం పోయేసరికి వారను కున్నట్లే దొంగలు బండి నాపారు. "మీవద్ద ఉన్న డబ్బు యిలా పడేయండి మర్యాదగా" అని గర్జించాడు దొంగల నాయకుడు. ప్రయాణీకులందరూ డబ్బు నాయ కునిముందు పోశారు. అది తృప్తి కలిగించలేదు దొంగలనాయకునికి." మరి మూడు వందల రూపాయలు యివ్వండి, లేకపోతే మీదగ్గరినుండి యెలా-రాబట్టుకోవాలో నాకు తెలుసునని ఒక వురుము వురిమాడు.

బండిలో మూలగా కూర్చున్న వృద్ధుడు పొడిదగ్గు దగ్గుతూ "ఆమె కాళ్ల మేజోళ్లు విప్పండి, మీకు కావలసిన ధనము దొరుకుతుం"దన్నాడు. దొంగల నాయకుడికి తను జాగ్రత్తగా దాచుకున్న డబ్బు యివ్వక తప్పిందికాదు పాపం ఆ దీనురాలికి. దొంగలు వెళ్లిపోయారు. ఆ యువతి దుఃఖానికి అంతంలేదు. వృద్ధ ప్రయాణీకుని ఆడిపోసింది. బండిలోని యితర ప్రయాణీకులు కూడ ఆ వృద్ధుని-ఎంతో తిట్టిపోశారు. ఇంకా కసితీరక మధ్యమార్గంలోనే అతనిని బండినుండి క్రిందికి తోస్తామని బెదిరించారు. అన్నిటికీ వృద్ధుని సమాధాన మొకటే. "ఎవరి జాగ్రత్తలో వారుండాలిగదా" అని.

బండి నగర పరిసరానికి పోయింది. వృద్ధుడు హఠాత్తుగా బండినుండి దూకి పారిపోయాడు, వారతనిపై కసి తీర్చుకోక మునుపే. అందరూ గమ్యస్థానం చేరుకున్నారు. ప్రొద్దుక్రుంకింది. రాత్రి అయ్యేసరికి ఆ అనాథ యువతికి తన కింక వేరే దిక్కులేదని, వున్న డబ్బుకాస్తా పోయినదని [illegible] కాసాగింది. ఆ రాత్రంతా ఆమెకు కంటి మీద కునుకులేదు.

తెల్లవారింది. తనగదిలో గడ మంచె మీద తన వరువుచుట్ట పెట్టుకోటానికి పోగా మేజా బల్లమీద ఒక పెద్ద కవరు కనిపించింది. దానిపై ఆమె చిరునామా కన్పించింది పెద్ద అక్షరాలలో. ఆశ్చర్యంతో కవరు చించి చూచింది. ఆమెకు వుత్తరం వ్రాసే వాళ్లీలోకంలో ఎవరూలేరు. కాని కవరులో నున్న డబ్బు చూచేసరికి ఆమె దుఃఖం పటాపంచలైంది. దుఃఖంతో నీరసించిన ఆమె ముఖంలో నూత్నవికాసం కనిపించింది. దానిలో మూడు వందరూపాయల నోట్లు, శ్రేష్టమైన దంతపు చట్రంలో బిగించిన ఒక అందమైన అద్దమూ వున్నాయి. తన పేరుతో ఒక వుత్తరంకూడ వుంది. వుత్తరంతీసి చదువనారంభించింది.

ప్రియమైన శ్రీమతికి

మీకు నిన్నటి దినం నేనొనర్చిన అపరాధానికి పరిహారంగా యీ చిన్న పారితోషికాన్ని తమకు పంపుకొంటున్నాను. ఈ అద్దము నాలుగువందల రూపాయల విలువ చేస్తుంది. కనక నాయందాగ్రహము విడిచి అవి పుచ్చుకోండి. నిన్న మనం పయనించేటప్పుడు నావద్ద ముప్పైవేల రూపాయల చెక్కువుంది. మనం ఉపేక్షచేస్తే నీ పైకంతోపాటు నా 30,000 రూపాయల చెక్కుకాగితం గూడా దొంగల పాలైపోయేది. నేను అష్టకష్టాలు పడి ఆర్జించిన ఆ ధనం పోగొట్టుకోలేక నీ డబ్బు వారికి వప్పజెప్పాను. క్షమించాలి. తరవాత నీ డబ్బు నీకు ముట్ట చెప్పాలనే నా ఉద్దేశ్యం. నీ కెల్లప్పుడూ కృతజ్ఞుడనై వుంటాను.

నీ శ్రేయోభిలాషి, "రఘువీర్"

(ఆంధ్రసచిత్ర వారపత్రిక 14-2-51 సంచిక నుంచి) ○